సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 26 । మే । 2023



ఎవరికి వారుగా 'డబుల్' ఇళ్లలోకి..
అప్పన్నగూడెంలో పంపిణీ చేయకముందే కొందరు లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశించారు.
- 8లో



ఎంసెట్‌లో మెరిసిన శన్విత
మాడ్గులపల్లి మండలం బొమ్మకల్లుకు చెందిన శన్విత ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ 7వ ర్యాంక్ సాధించింది.
-8లో

గరిష్టం/కనిష్టం
43° / 27°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎం సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, పోడు పట్టాల పంపిణీ, హరితహారం, ఇళ్ల పట్టాల పంపిణీ వంటి పలు అంశాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ యస్. వెంకట్రావు , ఎస్పీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి



విజయరాఘవపురంలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ యాదయ్య

మునగాల(కోదాడ): గ్రామపంచాయతీ పాలక వర్గం, సిబ్బంది గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎస్.యాదయ్య కోరారు. మునగాల మండలం విజయరాఘవపురం గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం, వైకుంఠ ధామం, కంపోస్టు షెడ్, నర్సరీని పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీఓ ఎస్.భూపాల్‌రెడ్డి, సర్పంచ్ రేబల్లే యశోద, ఉపసర్పంచ్ గుండు లింగారావు, జొన్నలగడ్డ సుధాకర్, సుంకర అజయ్‌కుమార్ ఉన్నారు.

దళిత బంధు డబ్బులు ఇప్పించండి




మాట్లాడుతున్న బాధితులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన చింతపల్లి జక్కయ్యకు సంబంధించిన దళిత బంధు డబ్బులను కొంత మంది కాజేశారని లబ్ధిదారుడి తల్లి వీరమ్మ ఆరోపించారు. గురువారం స్థానికంగా విలేకరుతో మాట్లాడుతూ జక్కయ్య బధిరుడు కావడంతో అతనికి తెలియకుండానే కొంత మంది దళిత బంధు డబ్బులు బ్యాంకులో వేసుకొని స్వాహా చేశారని తెలిపారు. ఈ విషయంపై తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులు విచారణ జరిపి దళిత బంధు డబ్బులు ఇప్పించాలని వేడుకున్నారు.

కరెంటు మోత!

- పెరిగిన విద్యుత్ వినియోగం
- గత ఏడాది మార్చి నుంచి మే వరకు పోల్చుకుంటే ఈ సారి 296.53 మిలియన్ యూనిట్లు పెరుగుదల
- అధిక మొత్తంలో వస్తున్న బిల్లులు





నాగారం : రోజురోజుకూ మండిపోతున్న ఎండలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. జిల్లాలో చాలా చోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటి నమోదవుతున్నాయి. ఉదయం ఏడు గంటలకు మొదలవుతున్న వేడి సెగలు రాత్రి ఏడు గంటలయినా తగ్గడం లేదు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందటానికి ప్రజలు రోజంతా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వినియోగిస్తుండడంతో మీటర్లు గిరగిరా తిరుగుతున్నాయి. జిల్లాలో గత ఏడాది మార్చి నుంచి మే వరకు 444.59 మిలియన్ యూనిట్లు కరెంటు వినియోగించగా ఈ సారి 744.12 మిలియన్ యూనిట్లు వాడారు.

ఒక యూనిట్ పెరిగినా..

విద్యుత్ వినియోగంలో ఒక్క యూనిట్ విద్యుత్ వినియోగం పెరిగినా బిల్లులో భారీ వ్యత్యాసం వస్తుంది. శ్లాబ్ మారి బిల్లు అమాంతం పెరుగుతుంది. వేసవిలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వాడుతుండటంతో బిల్లులు ఎక్కువ మొత్తంలో వస్తున్నాయి. గృహ వినియోగదారులకు శ్లాబ్-1(ఏ) కింద 0-50 యూనిట్లకు రూ.1.95, 51-100 యూనిట్లకు రూ.3.10 వసూలు చేస్తున్నారు. 50 యూనిట్లలోపు ఉంటే కస్టమర్ చార్జీ కింద రూ.40, 100 యూనిట్లు దాటితే రూ.70 అదనంగా తీసుకుంటున్నారు. ఒక యూనిట్ పెరిగినా శ్లాబ్ మారుతుంది. వంద యూనిట్లకు ఒక యూనిట్ పెరిగినా శ్లాబ్-1 (బి) కింద 0-100 వరకు రూ.3.40, 101-200 వరకు రూ.4.80లకు పెరుగుతుంది. ఇదే సమయంలో కస్టమర్ చార్జీ రూ.90 వేస్తున్నారు. ఇలా వినియోగదారుడిపై భారం పడుతుంది. వేసవిలో అధికంగా గృహ వినియోగదారులు 200కు పైగా యూనిట్లు వినియోగిస్తున్నారు. ఒక యూనిట్ మారినా లెక్క మారుతుంది. శ్లాబ్-1 (బి)(చ) కింద లెక్క తీస్తూ 0-200 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.5.10 వసూలు చేస్తున్నారు. ఇదే సమయంలో కస్టమర్ చార్జీని రూ.100కు పెంచేస్తున్నారు. 201-300 యూనిట్లకు రూ.7.70లు, ఇలా కరెంటు బిల్లులు పెరుగుతున్నాయి.

అనూహ్యంగా పెరిగి..

జిల్లాలో గృహ విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. జిల్లాలో గృహావసరాలు, వాణిజ్య, వ్యవసాయం తదితర వాటికి సంబంధించి 4,91,598 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ విద్యుత్ వినియోగ కనెక్షన్లు 3,13,087, వాణిజ్య కనెక్షన్లు 38,975 , వ్యవసాయకనెక్షన్లు 1,39,536 ఉన్నాయి. జిల్లాలో ఈ ఏడాది మార్చిలో 271.54, ఏప్రిల్‌లో 285.16, మేలో 187.42 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అయ్యింది. ప్రస్తుతం యాసంగి సీజన్ పూర్తికావడం, జిల్లాలో వేసవి పంటలు ఎక్కువగా లేకపోవడంతో వ్యవసాయరంగానికి విద్యుత్ వినియోగం తగ్గడంతో గత నెలలతో పోల్చుకుంటే మేలో వినియోగం కొంత తగ్గిందని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

కరెంటు వాడకం పెరిగింది



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో కరెంటు వాడకం పెరిగింది. వేసవిలో ఎండ వేడిమి తాళలేక వినియోగదారులు రోజంతా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు అధికంగా వాడటమే దీనికి కారణం. జనవరి నుంచి ఏప్రిల్ వరకు విద్యుత్ వినియోగం క్రమంగా పెరిగింది. మే నెలలో గృహ విద్యుత్ వినియోగం పెరిగినా, వ్యవసాయ పంటలు లేకపోవడంతో విద్యుత్ వినియోగం తగ్గింది.

–శ్రీనివాస్, విద్యుత్‌శాఖ డీఈఈ, సూర్యాపేట.

నేడు మంత్రి హరీష్‌రావు రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్న వైద్యారోగ్య శాఖ మంత్రి



రాంపురంలో బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు శుక్రవారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఉదయం 10:30 గంటలకు వేములపల్లికి చేరుకుంటారు. అక్కడ గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆ తరువాత 10:45 గంటలకు మిర్యాలగూడలోని 6వ వార్డు ఇందిరమ్మ కాలనీలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తారు. 11 గంటలకు మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడ్ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత 11:20 గంటలకు అక్కడే 28 హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. 11:45 గంటలకు మిర్యాలగూడ ఎన్ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో ఆత్మీయ సమ్మేళనంలో హరీష్‌రావు పాల్గొని మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని మాధవరాయినిగూడెం బస్తీ దవాఖానాను ప్రారంభిస్తారు. 3:30 గంటలకు రాయినిగూడెం పల్లె దవాఖానాను ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఎర్రగట్టు బస్తీ దవాఖానాను ప్రారంభించి హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు మఠంపల్లి మండల కేంద్రంలో రైతు వేదికను ప్రారంభిస్తారు. శ్రీకాంతాచారి విగ్రహాన్ని, తెలుగు తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 5:30 గంటలకు మఠంపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు అక్కడి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని సందర్శిస్తారు. 6:30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్ వెళతారు.

అట్టహాసంగా బాస్కెట్‌బాల్ పోటీలు





సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్-16 బాస్కెట్ బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్ తదితరులు

పోరాట యోధుడు వీరారెడ్డి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- చింతలపాలెంలో ఉస్తేల వీరారెడ్డి విగ్రహావిష్కరణ



ఉస్తేల వీరారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, నాయకులు

హుజూర్‌నగర్ : ఈప్రాంత ప్రజల కోసం పోరాడిన యోధుడు ఉస్తేల వీరారెడ్డి అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. చింతల పాలెంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు ఉస్తేల వీరారెడ్డి విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఉస్తేల వీరారెడ్డి, రాములమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్తేల నారాయణరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ వీరారెడ్డి చేసిన ఉద్యమాలు ఎందరికో స్ఫూర్తి నిచ్చాయన్నారు. దున్నే వానికే భూమి కావాలని కమ్యూనిస్టులు ఉద్యమిస్తే భూమి ఎక్కడుందని కొందరు ప్రశ్నించారని, అలాంటి వారికి భూపోరాటాలే సమాధానం ఇచ్చాయన్నారు. పారిశ్రామిక వేత్తలకు రూ. 13 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిన కేంద్రం రైతాంగానికి లక్ష కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు.

నిస్వార్థ సేవకుడు వీరారెడ్డి : ఉత్తమ్

పేదలు, కార్మికులకోసం వీరారెడ్డి నిస్వార్థంగా జీవితాంతం అంకితభావంతో సేవ చేశారని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. తెలంగాణలోని కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలకు భూమిలేని కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల కోసం నిస్వార్థంగా పోరాటాలు చేసిన గొప్ప చరిత్ర ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేదల సమస్యలపై ధైర్యంతో పోరాటం చేయడం వీరారెడ్డి నిబద్ధతకు నిదర్శనమన్నారు. సభలో సీపీఐ జాతీయ నాయకులు చాడా వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు పశ్యపద్మ, బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, దొడ్డా నారాయణరావు, బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడారు. సీపీఐ కార్యాలయం వద్ద ఎర్రజెండా ఎగురవేశారు. అమరవీరుల స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు ఉస్తేల సృజన, దేవరం మల్లీశ్వరి, యల్లావుల రాములు, జడ శ్రీను, మేకల శ్రీనివాసరావు, కొండ కోటయ్య, పాలకూరి బాబు, ధనుంజయ నాయుడు, దొడ్డా వెంకటయ్య, కంబాల శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, చిత్రంలో నారాయణ, ఉత్తమ్

ఆధార్ సేవలు పునః ప్రారంభం

భానుపురి : కొంతకాలంగా నిలిపివేసిన ఆధార్ సేవలను ఈ నెల 25 నుంచి ప్రారంభిస్తున్నట్లు సూర్యాపేట హెడ్ పోస్ట్ మాస్టర్ కె.యాదగిరి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని సూర్యాపేట పోస్టాఫీస్‌లోనే ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో కూడా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యఅగ్నిహోత్రి, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచ గవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు తిరుమలగిరి పట్టణ బంద్



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అఖిలపక్ష నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం తిరుమలగిరి పట్టణ బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుకూరి సోమయ్య తెలిపారు. గురువారం తిరుమలగిరిలో అఖిలపక్ష పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ బంద్‌ను ప్రజలు, వ్యాపారులు విజయవంతం చేయాలని కోరారు. దళిత బంధులో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే పరుష పదజాలం ఉపయోగించారని పేర్కొన్నారు. అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన మహా ధర్నాలో నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వై.ధీన్‌దయాళ్, కడెం లింగయ్య, కందుకూరి శ్రీను, రాంబాబు, భానుమహరాజ్, పేరాల శ్రీను, వీరేష్, కందుకూరి శ్రీను, పరమేష్, కుక్కల సోమేష్, మల్లెపాక కృష్ణ, సుధాకర్, ఎర్ర యాకూబ్, పేరాల వీరేష్, శేఖర్, ఉపేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే..

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎప్పటికైనా ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువు అవుతదన్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి అడ్డంగా దొరికినా కేసీఆర్‌తోఉన్న లోపాయకార ఒప్పందం కారణంగానే ఇప్పటికి కూడా ఆ కేసు ముందుకు కదలట్లేదన్నారు. మోడీ ప్రధాని అయ్యాక దేశంలో మత ఘర్షణలు , స్కామ్‌లు జరగకుండా అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ చాడ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, అసెంబ్లీ కన్వీనర్లు కర్నాటి కిషన్, కాపా రవికుమార్, కనగాల నారాయణ, శేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయి బాబా, యశ్వంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంజీయూలో రెండో రోజూ న్యాక్ బృందం పరిశీలన

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో గురువారం రెండో రోజూ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) బృందం సభ్యుల పరిశీలన కొనసాగింది. యూనివర్సిటీలోని అన్ని శాఖల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన ఈ పరిశీలన మొదట క్రీడా మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో జరిగిన అంతర్ కళాశాలల పోటీలు, పోటీలలో ఎంపికైన విద్యార్థుల వివరాలు సేకరించారు. అదేవిధంగా యోగా తరగతుల పరిశీలన, జాతీయ సేవా పథకం కార్యకలాపాలు, జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన వినూత్నమైన సేవా కార్యక్రమాలపై సంబంధిత అధ్యాపకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహాలు, హెల్త్ సెంటర్, కళాశాలలో మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల ప్రవర్తన తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ తుమ్మ కృష్ణారావు, ఓఎస్డీ అల్వాల రవి, రేఖ, డాక్టర్ మద్దిలేటి, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్, కొప్పుల అంజిరెడ్డి, ఆకుల రవి, శ్రీదేవి, లక్ష్మీప్రభ, సరిత తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూరు(ఎం): మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన వస్పరి శ్రీశైలం తన సెల్‌ఫోన్ పోయిందని ఆత్మకూరు(ఎం) పోలీసులను ఆశ్రయించగా సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి గురువారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దొమ్మేటి నాగరాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న, చోరీ గురైన సెల్‌ఫోన్‌లను సులభంగా గుర్తించి బాధితులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తు గడువు పెంపు

నల్లగొండ: తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం (బీసీ స్టడీ సర్కిల్) ఆధ్వర్యంలో గురుకుల టీచర్ పోస్టులకు సన్నద్ధమయ్యే వారికి ఇవ్వనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు ఈ నెల 28 వరకు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ సంచాలకుడు కె. విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన వారు వెబ్‌సైట్ tsbcstudycircle.cgg.gov.in ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీఈడీ సర్టిఫికెట్లతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇటీవల దిగిన పాస్‌ఫొటో, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు జూన్ 1వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

మెప్మా పీడీగా కరుణాకర్

నల్లగొండ టూటౌన్: మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కరుణాకర్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న శ్రీపాద రామేశ్వర్‌ను జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ లేఖ రాసిన విషయం తెలిసిందే. 15రోజులుగా పీడీ పోస్టు ఖాళీగా ఉండటంతో కరుణాకర్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కరుణాకర్ గతంలో మెప్మా ఏఓగా పనిచేశారు.

ఎంసెట్‌లో మెరిసిన శన్విత

- మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు విద్యార్థినికి స్టేట్ 7వ ర్యాంకు
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ విజయం
- ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవడమే లక్ష్యం: శన్వితారెడ్డి



తల్లిదండ్రులతో శన్వితారెడ్డి, సోదరుడు సుహాస్ రోహణ్‌రెడ్డి

మాడుగులపల్లి: ఎంసెట్‌లో నల్లగొండ జిల్లా విద్యార్థిని మెరిసింది. గురువారం విడులైన తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు గ్రామానికి చెందిన శన్వితారెడ్డి రాష్ట్ర స్థాయిలో ఇంజినీరింగ్ విభాగంలో 7వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం ఐఐటీ అడ్వాన్స్‌పై దృష్టి పెట్టిన శన్విత ముంబై ఐఐటీలో సీటు సాధించాలన్నదే తన లక్ష్యమని పేర్కొంటోంది. శన్వితారెడ్డి తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో ఉద్యోగ రీత్యా మిర్యాలగూడలో స్థిరపడ్డారు. శన్విత ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, 6, 7 తరగతులు చలకుర్తి నవోదయ పాఠశాలలో, 8 నుంచి 10వ తరగతి వరకు విజయవాడలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో చదివింది. ఇంటర్ విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో చదివి ఎంపీసీ విభాగంలో 977 మార్కులు సాధించింది. ఎంసెట్‌లోనూ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గురువారం ఆమె 'సాక్షి'తో మాట్లాడింది. చిన్ననాటి నుంచి ప్రతి సబ్జెక్టును ఇష్టంగా ఎంజాయ్ చేస్తూ చదివేదాన్ని. ఇంటర్‌లో కష్టపడి 977 మార్కులు సాధించినా సంతృప్తిని ఇవ్వలేదు. ఎంసెట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించాలని లక్ష్యంతో ప్రయత్నించా. అన్ని విభాగాలకు సమాన సమయం కేటాయిస్తూ ప్రణాళికాబద్ధంగా నిత్యం 12 గంటలకుపైగా చదివా. ఒత్తిడిని అధిగమించేందుకు ఉదయం యోగా, వీలు చిక్కితే చెస్ ఆడేదాన్ని. ఈ సారి ఎంసెట్ ప్రవేశ పరీక్షలో ఊహించిన దానికన్నా మ్యాథ్స్ సబ్జెక్ట్ చాలా కష్టతరంగా ఉంది. పరీక్ష రాసిన తరువాత నార్మలైజేషన్‌లో 20–50 మధ్య ర్యాంకు రావొచ్చని ఊహించా. కానీ రాష్ట్రస్థాయిలో 7 ర్యాంకు ఊహించలేదు. అదీ బాలిక నుంచి రాష్ట్రంలోనే తొలిస్థానంలో ఉంటానని అస్సలు అనుకోలేదు. కష్టానికి ఫలితం దక్కిందని ఆనందంగా ఉంది.



వద్దె శన్వితారెడ్డి

చాలా ఆనందంగా ఉంది

శన్విత చిన్ననాటి నుంచి చదువుల్లో చాలా చురుకుగా ఉండేది. తరగతిలో ఫస్ట్ ర్యాంకులో నిలిచేది. ఇంటర్‌లోనూ అదే ఒరవడి కొనసాగించింది. ఎంసెట్‌లోనూ రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం గొప్పగా అనిపించింది. ఫిజిక్స్‌లో నేను, మ్యాథ్స్‌లో నా భార్య పీజీలు పూర్తి చేశాం. ప్రస్తుతం నేను ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నా. నా భర్య లలిత టీచర్ ఉద్యోగానికి సన్నద్ధమవుతోంది. ఇద్దరం చిన్ననాటి నుంచి శన్వితను చదువుల్లో ప్రోత్సహించడం, ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఈ విజయం సాధ్యమమైంది.

– వద్దె మధుసూదన్‌రెడ్డి, శన్వితారెడ్డి తండ్రి

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే ఈ విజయం

మా నాన్న ఉపాధ్యాయుడు. అమ్మ గృహిణి. ఇంట్లో నేనే పెద్దదాన్ని. తమ్ముడు 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఎప్పుడూ క్రమశిక్షణతో చదవాలని సూచించే వారే కానీ ఒత్తిడి పెంచలేదు. వారి ప్రోత్సాహం, ఉపాధ్యాయుల బోధనకు తోడు నా శ్రమ.. ఈ విజయాన్ని అందించాయి. ప్రస్తుతం ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు సన్నద్ధమవుతున్నా. ముంబాయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలన్నది నా కోరిక. సివిల్స్ సాధించాలన్నది జీవిత లక్ష్యం.

'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ



విజయచిహ్నం చూపిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య, విద్యార్థులు, అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: టీఎస్ ఎంసెట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం వారు ఖమ్మంలో అభినందించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో బి.వివేక్ వర్ధన్ వర్మ 139వ ర్యాంకు, కె.జన్వితాదేవి 199, బి.జశ్వంత్‌కుమార్ 245, ఏ.ఇందు 258, టి.శ్రీతేజ 261, ఎస్.కే.ఆర్షియా నౌరిన్ 314, పి.హర్షిత్ చౌదరి 351, సీహెచ్.సహస్ర 409, కె.కీర్తన వర్మ 490, పి.సాయి నిఖితరెడ్డి 527, టి.హర్షవర్ధన్ 790, వి.భరత్ 791, కె.శివగుప్త 858, బి.పూజిత 871, సీహెచ్.సాత్విక 915, ఆర్‌బీ.రాంచరణ్ 957, బి.అక్షిత 969వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం సీహెచ్.చేతన్‌మాథుర్, అకడమిక్ డీన్ ఎస్ఆర్ ఎస్‌డీ.వర్మ, ఏజీఎంలు సీహెచ్.బ్రహ్మం, జి.ప్రకాష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి కళాశాలకు ఉత్తమ ర్యాంకులు



సిరి



శ్రీలేఖ



అబియా కౌసర్



మనోజ్‌కుమార్



దివ్య



రూప

నల్లగొండ: నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం ప్రకటించిన ఎంసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లాలోనే అధిక ర్యాంకులు సాధించి చరిత్ర సృష్టించారని కళాశాల యజమాన్యం తెలిపింది. ఇంజనీరింగ్ విభాగంలో కళాశాలకు చెందిన వి.సిరి 800 ర్యాంకు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే సీహెచ్ రూప 1310, శ్రీలేఖ 1556, అబియా కౌసర్ 3291, మనోజ్‌కుమార్ 3792, బి.దివ్య 3858, సంతోష్ 4093, సాయికృష్ణ 4895, నిఖిత 4974, ఆర్.చరణ్ 5023, సాయిచరణ్ 5029, కీర్తన 5755, నయన 6076, సాయికిరణ్‌రెడ్డి 6527, అఖిల 6905, డి.నవ్య 6974, ఆర్.అనివాస్ 7169, ఎం.సుదీక్ష 7510, వేద 7649, సాయిరాం గౌడ్ 7679, ఇందుశ్రీ 8038, సూర్యతేజ 8118, సింధు 8257, శ్రీనిధి 8384, గోపిచంద్ 8533, ఎస్.రూపాంజలి 9969 ర్యాంకులు సాధించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చంద కృష్ణమూర్తి, డైరెక్టర్లు నరేందర్‌బాబు, శశిధర్‌రావు, చంద శ్రీనివాస్, రమేష్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు.

లక్ష్యాన్ని మించి ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, హాజరైన అధికారులు

నల్లగొండ: ప్రస్తుత యాసంగి సీజన్‌లో అనుకున్న లక్ష్యం మేరకు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాను ముందంజలో ఉంచామని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులు, డీఆర్‌డీఓ, సహకారశాఖ అధికారులు, లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 79వేల మంది రైతుల నుంచి ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసినట్టు వెల్ల డించారు. జిల్లాలో ఇంకా 50వేల నుంచి 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉందని, ప్రతి మిల్లర్ కొనుగోలు కేంద్రం నుంచి లారీల్లో వచ్చిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలు మూతపడతాయన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ శాఖ అధికారులు తాలు, రాళ్లు లేకుండా శుభ్రపరచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల డీఎం నాగేశ్వరరావు, డీఆర్‌డీఓ కాళిందిని, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, యాదగిరి, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఓటరు నమోదు షెడ్యూల్ విడుదల

నల్లగొండ: రెండో విడత ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. 1 అక్టోబర్, 2023 నాటికి 18 సంవత్సరాల వయస్సు ఉండే వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే ఈ నెల 25 నుంచి జూన్ 23 వరకు బీఎల్ఓలు ఇంటింటికి తిరిగి ఓటరు నమోదు కోసం పరిశీలన చేస్తారు. ఒక్కో బూత్‌లో 1,500 మంది ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటే మరో బూత్‌కు రికమండ్ చేస్తారు. ఇది జూన్ 24న పూర్తి చేస్తారు. ఆగస్టు 2న ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. ఆగస్టు 2 నుంచి 31వరకు ఆ జాబితాపై వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తారు. కొత్తగా ఓటరు నమోదు కోసం రెండో శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 22న ఫిర్యాదులను పరిష్కరించి అక్టోబర్ 4న తుది ఓటరు జాబితాను విడుదల చేశారు.

సత్తాచాటిన 'గౌతమి' విద్యార్థులు



ఉమా మహేష్



స్వాతి



సోని



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ వెంకట్‌రెడ్డి

నల్లగొండ: ఎంసెట్ ఫలితాల్లో గౌతమి విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఇంజనీరింగ్ విభాగంలో కళాశాలకు చెందిన ఉమామహేష్ 1241, ఎం.స్వాతి 1259, కె సోని 4407, కె.అక్షిత 4436, రోహిత్‌రెడ్డి 5415 ప్రజ్ఞరెడ్డి 6914, ప్రతిభ 8639, సాత్విక్‌రెడ్డి 9611, సామిత్‌రెడ్డి 9166, జ్యోతిష్యకుమార్ 9944, పావని 10752, అక్షిత 11198 ర్యాంకులు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో నిషాత్ ఫాతిమా 7114, పూజిత 8011 ర్యాంకులు సాధించారని కళాశాల డైరెక్టర్ కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకట్‌రమణ, రఘుపాల్‌రెడ్డి, పుట్ట వెంకట్‌రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

వేతనాలు పెంచకపోతే సమ్మె తప్పదు



మెడికల్ కళాశాల ఏడీకి వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నల్లగొండ టౌన్: నల్లగొండ మెడికల్ కళాశాల, హాస్టల్ కార్మికులకు వేతనాలను పెంచకపోతే సమ్మె తప్పదని గురువారం మెడికల్ కళాశాల ఏడీ శ్రీనివాస్‌కు ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్ కార్మికుల టెండర్లను వెంటనే పూర్తిచేసి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో టెండర్లు పూర్తిచేసి కొత్త వేతనాలు ఇస్తున్నటికీ నల్లగొండ మెడికల్ కళాశాలలోనే ఇంకా టెండర్లు పూర్తి చేయకుండా కార్మికులకు పాత వేతనాలే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు గడుస్తున్నా టెండర్లను పూర్తి చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే జమీర్, ఎండీ జకీర్, అండాలు, విజయ, ఉమా, రేణుక, కవిత, చంద్రమ్మ, కోటేశ్వరీ, సీతా, లక్ష్మి, శిల్ప, కృష్ణవేణి, కనకలక్ష్మి, అరుణ, ఇద్దమ్మ, మంగమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

వడదెబ్బతో ఒకరు మృతి

చింతపల్లి : వడదెబ్బతో ఇటుకబట్టీ కూలీ మృతి చెందాడు. వివరాలు.. చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామ సమీపంలో ఇటుక బట్టీలో ఒడిషా రాష్ట్రంలోని రాజ్‌కడియాల్ ప్రాంతానికి చెందిన ప్రేమ్ లాల్ బోయి(35) కుటుంబ సభ్యులతో కలిసి పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ప్రేమ్‌లాల్ బోయి అస్వస్థతకు గురికావడంతో భార్య మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం బుధవారం దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. భార్య అసిత బోయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి విద్యార్థి మృతి

- రాఘవాపురం గ్రామ పరిధిలోని గ్రాండ్ విల్లా రిసార్ట్‌లో ఘటన

బీబీనగర్: మండలంలోని రాఘవాపురం గ్రామ పరిధిలో గల గ్రాండ్ విల్లా(మ్యాగ్జిమా) రిసార్ట్‌లోని స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి ఓ విద్యార్థి మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రంలోని బరంపూర్‌కు చెందిన రఘునాథ్ కుమారుడు శ్రీశాంత్(12) 7వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో శ్రీశాంత్ ఇటీవల హైదరాబాద్ పరిధిలోని నాగారంలో గల తన మామ డిండి సతీష్ వద్దకు వచ్చాడు. కాగా ఈ నెల 24న మండలంలోని రాఘవాపురం వద్ద గల మ్యాగ్జిమా రిసార్ట్‌లో సరదాగా గడిపేందుకు మామతో కలిసి వచ్చిన శ్రీశాంత్ స్విమ్మింగ్‌పూల్‌లో ఆడుతూ మునిగి చనిపోయాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఈ విషయం బయటకు పొక్కకుండా రిసార్ట్ నిర్వహకులు జాగ్రత్త పడుతున్నారని, స్విమ్మిగ్‌పూల్ వద్ద ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వలనే ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్రీడా పోటీలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

సూర్యాపేట టౌన్: క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్–16 బాస్కెట్ బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. 33 జిల్లాల నుంచి తరలివచ్చిన జట్లు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడల్లో పాల్గొంటున్న 500 మంది బాలబాలికలకు అన్ని వసతులు కల్పించామన్నారు. ఈ సందర్భంగా మొదటి రోజు పలు జిల్లాల బాలబాలికల జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, తుంగతుర్తి ఎమ్మెల్యే, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాదరి కిషోర్‌కుమార్, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్‌కేశవ్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, జిల్లా క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, డీఎస్పీ నాగభూషణం, జిల్లా కార్యదర్శి పారూఖ్ తదితరులు పాల్గొన్నారు.



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

ఎవరికి వారుగా 'డబుల్' ఇళ్లలోకి..



డబుల్ బెడ్‌రూం ఇంటి ముందు శుభ్రం చేసుకొంటున్న లబ్ధిదారులు

మోతె: అధికారికంగా పంపిణీ చేయకముందే కొందరు లబ్ధిదారులు డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి ప్రవేశించారు. ఈ సంఘటన మోతె మండలం అప్పన్నగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. అప్పన్నగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన 40 డబుల్‌బెడ్రూం ఇళ్లకు రెండు నెలల క్రితం లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. నేటికీ వారికి ఇళ్లు పంపిణీ చేయకపోవడంతో నిరీక్షించలేక గురువారం తెల్లవారుజామున కొందరు లబ్ధిదారులు ఎవరికి వారుగా సామగ్రితో వచ్చి తమకు కేటాయించిన నంబర్ గల ఇళ్లలో దిగిపోయారు. ఏకంగా ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్‌ను వివరణ కోరగా అధికారికంగా తమకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, పట్టాలు పంపిణీ చేయకముందే ఇళ్లలోకి ప్రవేశిస్తే పైఅధికారుల ఆదేశాల మేరకు ఖాళీ చేయిస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికలో మార్పులు ఉండవని, లబ్ధిదారులంతా సంయమనం పాటించాలని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువా తాళం పగులగొట్టిన దుండగులు

సూర్యాపేట క్రైం: సూర్యాపేట పట్టణంలోని 15వ వార్డు బాలాజీ నగర్‌లో బుధవారం రాత్రి కుంచం ఉపేందర్ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపేందర్ బాలాజీనగర్ బేకరీ దుకాణం నిర్వహిస్తూ దాని వెనుకే ఇంట్లో ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం చివ్వెంల మండల కేంద్రంలో ఓ వివాహానికి వెళ్లిన ఉపేందర్ బుధవారం రాత్రి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.70 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెన్‌పహాడ్‌లో..

పెన్‌పహాడ్: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చీదెళ్ల గ్రామానికి చెందిన వంగవీటి శ్రావణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఇంటికి వచ్చేసరికి వేసిన తాను వేసిన తాళం బదులు మరో తాళం వేసి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ విషయమై ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్‌ను వివరణ కోరగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జూన్ 5 నుంచి శ్రీవల్లి టౌన్‌షిప్ ప్లాట్ల వేలం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ: నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం సమీపంలో గల రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్‌షిప్‌లో మిగిలిన 59 ఓపెన్ ప్లాట్లు, 209 పాక్షిక నిర్మాణ గృహాలకు జూన్ 5 నుంచి 10వ తేదీ వరకు ఐదో విడత వేలం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రీబిడ్ సమావేశంలో వేలం నియమనిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓపెన్ ప్లాట్లకు చదరపు గజానికి రూ.6వేలు, పాక్షికంగా నిర్మాణమైన గృహాలకు వాటి నిర్మాణ దశలు అనుసరించి చదరపు గజానికి రూ.6వేల నుంచి రూ.10,500 వరకు కనిష్ట ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ పేరున రూ.10వేల ఈఎండీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 91543 39209 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

ఆలేరురూరల్: ఆలేరు పట్టణంలోని అనుమతులు లేకుండా ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న విషయమై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి గురువారం రాత్రి ఐస్‌క్రీమ్ కంపెనీలో తనఖీలు చేశారు. ఐస్‌క్రీమ్ తయారీలో ఉపయోగిస్తున్న పదార్థాల శాంపిళ్లను సేకరించారు. శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తామని, ఫలితాలు వచ్చిన అనంతరం చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. భువనగిరిలోని పలు దాబా హోటళ్లలోనూ తనిఖీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

భూదాన్‌పోచంపల్లి: ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన సంఘటన బుధవారం అర్ధరాత్రి మండలంలోని దంతూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. దంతూరు గ్రామానికి చెందిన కంటి శ్రీశైలం పాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడి భార్య సంతోష, పిల్లలు కలిసి బుధవారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రించారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి గేట్ తీసుకొని లోనికి వచ్చి సంతోష మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెలతాడును చోరీ చేసేందుకు యత్నిస్తుండగా ఆమెకు మెలకువ వచ్చి కేకలు వేసింది. దీంతో పక్కనే నిద్రిస్తున్న ఆమె భర్త శ్రీశైలం అప్రమత్తమై దొంగను పట్టుకొనేందుకు ప్రయత్నించగా అతడు పుస్తెలతాడు తీసుకొని పరారయ్యాడు. వెంటనే శ్రీశైలం 100 నంబర్‌కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులు, పోలీసులు రాత్రంతా దొంగ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించినా అందులో ఏదీ రికార్డు కాలేదు. గురువారం ఉదయం భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర, చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, ఎస్ఐ విక్రమ్‌రెడ్డి, క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితురాలి భర్త శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చోరీకి వచ్చిన దొంగ నల్లగా బలిష్టిగా ఉండి, కేవలం నల్ల షార్ట్ వేసుకొని ఉన్నాడని బాధితురాలి తెలిపింది. ప్రజలు ఇంటి ఆరుబయట నిద్రించవద్దని, గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.